రైదాసు అనే సాధువు పరమ నిష్ఠాగరిష్టుడు. సజ్జనుడు. దైవభక్తి పరాయణుడు. అతడి భక్తికి, కర్తవ్య నిష్ఠ, ధర్మ పరాయణత్వానికి అందరూ అతణ్ణి తెగ మెచ్చుకునేవారు.

అయితే రైదాసు పరమ దుర్భర దారిద్ర్యంలో కాలం గడుపుతున్నాడు. అతడి కుటీరంలో దరిద్రం తాండవమాడుతూ ఉండేది. కాని ఈ పేదరికం అతడికి ఎంత మాత్రమూ ఇబ్బంది కలిగించేది కాదు.

ఒకసారి ఇంద్రుడు అతడి కుటీరం మీద నుంచి వెళ్తూ కొంచెం ఆగి చూశాడు. రైదాసు గురించి ఇంద్రుడికి అంతా అర్థమయిపోయింది. ఎలాగైనా సరే రైదాసుకి సహాయపడాలన్న సద్భావం ఇంద్రుడి మనసులో ఏర్పడింది.

ఇంద్రుడు రైదాసు ఎదుట నిలబడి, "తమరు సద్గుణ సంపన్నులు, ధర్మనిష్ఠాగరిష్ఠులు, దైవభక్తి పరాయణులు. ఇంతటి ఉత్తములైన తమరు ఇలా కటిక దారిద్ర్యం అనుభవించడం నాకు చాలా బాధగా ఉంది. చెప్పండి మహాత్మా, తమకి ఏం కావాలో చెప్పండి. క్షణాలలో అవి మీ ముందు ఉంచుతాను" అన్నాడు ఇంద్రుడు.

ఇంద్రుడికి నమస్కరించి రైదాసు వినమ్రంగా అన్నాడు, "నా సద్గుణ సంపదలను మెచ్చుకోవడానికి మీకు నాపై ఉన్న అభిమానమే కారణం. మహాత్మా, తమ కృపాకటాక్షాలకి కృతజ్ఞుణ్ణి. ప్రభు భక్తి తప్ప నాకు కావలసినవి ఏమున్నాయి? ఆ పరాత్పరుడి పాదసాన్నిధ్యం నాకు దూరం కాకుండా వరం ఇవ్వండి. అంతకు మించి ఈ దీనుడికిక ఏం కావాలి?" అన్నాడు రైదాసు.

"మహాత్మా, తమకి ఆ దైవసన్నిధి ఎన్నడూ దూరం

# అద్భుతమైన మణి

కాదు. అది తమ దగ్గరనే ఉన్న నిత్య పెన్నిధి. నేను ప్రత్యేకంగా ఇచ్చేది కాదది. తమ లాంటి ఉత్తములు ఇలా దారిద్ర్యం అనుభవించరాదు. మహాత్మా, తమకి నేను ఒక అద్భుతమైన మణిని అందిస్తున్నాను. దీనిని ఏ ఇనుపముక్కకి తాకించినా అది బంగారంగా మారిపోతుంది. ఆ బంగారంతో తమరు సర్వసంపదలతో తులతూగవచ్చు" అని ఇంద్రుడు ఆ సాధువుకి ఒక అద్భుతమైన మణిని ఇచ్చాడు.

ఇంద్రుడి మనసు నొప్పించచగూడదని రైదాసు మౌనంగా ఆ అద్భుతమైన మణిని తీసుకుని, తన కుటీరంలో ఒకచోట భద్రంగా దాచాడు.

ఇంద్రుడు రైదాసుకి సహాయపడ్డానన్న తృప్తితో అక్కడి నుండి వెళ్లిపోయాడు.

రైదాసు ఆ అద్భుతమైన మణిని ఇంద్రుడి నుండి తీసుకున్నా, దానిని ఉపయోగించాలని ఎన్నడూ అనుకోలేదు. ప్రయత్నించనూ లేదు.

ఇలా కొంత కాలం గడిచింది. ఒకసారి ఇంద్రుడు మళ్లీ రైదాసు కుటీరం వైపు వెళ్తూ ఉన్నప్పుడు, రైదాసు వైభవం చూడాలని రైదాసు కుటీరం దగ్గర ఆగాడు. కుటీరంలో తొంగిచూశాడు ఇంద్రుడు. రైదాసులో గాని, ఆయన కుటీరంలోని పరిస్థితిలోగాని ఎలాంటి మార్పు ఇంద్రుడికి కనిపించలేదు. ఎటు చూసినా దారిద్ర్యం యథాతథంగా కనిపించింది. ఇది చూసి ఇంద్రుడు ఆశ్చర్యపోయాడు.

అప్పుడు ఇంద్రుడు రైదాసు ముందు నిలబడి, "మహాత్మా, తమకి నేను ఒక అద్భుతమణిని ఇచ్చాను కదా? దానితో మీరు ఎంత బంగారమైనా తయారుచేసి, మహా ధనవంతులు అయివుండవచ్చును కదా? తమ దారిద్ర్యంలో ఎలాంటి మార్పూ రాలేదే? దానిని తమరు ఎందుకు ఉపయోగించలేదు?" అని రైదాసుని అడిగాడు.

అందుకు రైదాసు మందహాసం చేసి, "మహాత్మా, తమరు నాపై దయతో ఆ అద్భుత మణిని ఇచ్చారు. కాని, కష్టపడ కుండా వచ్చే అయాచిత సంపదలని నేను ఆశిం చను. తమరు ఇచ్చిన ఆ లోహాన్ని బంగారంగా మార్చే అద్భుత మణిని అలాగే భద్రంగా దాచి ఉంచాను. తమరు మళ్లీ వస్తే తిరిగి ఇచ్చేయాలని తమ కోసమే నిరీక్షిస్తు న్నాను. ఆరోజే దానిని తీసుకోరాదని అను కున్నాను. కాని నాకు సహాయం చేస్తున్నానన్న అనే తృప్తి మీకు దూరమవు తుందనే ఆరోజు దానిని మీ నుండి అలా స్వీకరిం చాను. ఏ సాధువు కైనా నిజమైన సంపద దైవభక్తి, భక్తసేవ తప్ప ఈ అశాశ్వత మైన సిరి సంపదలు కావని నా ప్రగాఢ విశ్వాసం. ఈ అద్భుత మణిని తిరిగి ఇస్తున్నం దుకు నన్ను క్షమించండి దేవరాజా!" అని రైదాసు ఇంద్రుడుకి ఆ అద్భుత మణిని తిరిగి ఇచ్చేశాడు.

రైదాసులోని నిజమైన భక్తి మరియు భోగభాగ్యా లపై అతడిలోని అనాసక్తి చూసి ఇంద్రుడు అతడికి భక్తిపూర్వకంగా నమస్కరించాడు. రైదాసునుండి ఆ మణిని తీసుకొని మౌనంగా వెళ్లిపోయాడు ఇంద్రుడు.

\- సుంకర భాస్కరరావు